ప్రజాశక్తి
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ప్రజా ఉద్యమాలకు విరాళాలు ఇచ్చి తోడ్పడండి..

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పామూరు

ప్రజా ఉద్యమాలకు విరాళాలు ఇచ్చి.. సిపిఎంకు తోడ్పాటునందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. పామూరులోని ధనికులవారి పాలెంలో ఇంటింటికీ సిపిఎం పేరుతో ప్రజా ఉద్యమాలకు విరాళాలు సేకరించారు. ఈ నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలూ పోటీ పడి ఓటర్లకు డబ్బు ఎర వేస్తున్న సమయంలో సిపిఎం ప్రజల నుండే నిధి వసూలు చేస్తోందన్నారు. ప్రజా ఉద్యమాలకు, ప్రజలకు అండగా నిలిచే సిపిఎంకు నిధులిచ్చి.. ప్రజలు తోడ్పాటునందించాలని కోరారు. కార్పొరేట్ వాళ్ల ఇచ్చే నిధులను సిపిఎం తీసుకోదని, సిపిఎం ప్రజల పార్టీ అని, పార్టీని నడిపించాల్సింది ప్రజలేనని, ప్రజలు అందుకే విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలను, కార్మిక ఉద్యమాలను బలపరచాలని కోరారు. రాష్ట్ర అభివద్ధి కోసం నిజాయతీగా, నిస్వార్థంగా ప్రజల పక్షాన సిపిఎం నిలబడుతుందన్నారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, నాయకులు షేక్ కాశీంసాహెబ్, సిహెచ్.వెంకటేశ్వర్లు, బైవి నారాయణ, రమీజా, శ్రీను, బి.నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఎక్కడున్నాం.?

- జిల్లా ఏర్పడి 55 ఏళ్లు..
- ఇప్పటికీ ట్యాంకర్లతోనే తాగునీరు అందజేత
- నానాటికీ తగ్గిపోతున్న సాగు
- పరిశ్రమలు లేక ఉపాధి కోసం కొనసాగుతున్న వలసలు
- చదువుకున్న యువకులూ ఇతర పట్టణాలకు పోతేనే జీవనం
- నేడు జిల్లా అవతరణ దినోత్సవం



వెలిగొండ ప్రాజెక్టు సొరంగం (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లా ఏర్పాటై 55 ఏళ్లు అయ్యింది. పేరులోనే ప్రకాశం తప్ప ప్రజల జీవితాల్లో కనిపించడం లేదు. ఈ 55 ఏళ్లలో ఎక్కడున్నామంటే అక్కడే ఉన్నామన్నది వాస్తవం. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో జరిగిన అభివృద్ధి తప్ప జిల్లాలో ఉన్న సహజవనరుల ఆధారంగానైతే ఎటువంటి అభివృద్ధీ కనిపించడం లేదు. అందుకు కారణం సమగ్రాభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయక పోవడమే.. రాజకీయ పథకాలు తప్ప.. సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు లేవు. ఓట్ల కోసం ప్రణాళికలు తప్ప జనం బాధలు తీర్చేందుకు దారులు లేవు. కనీసం దాహార్తిని కూడా తీర్చలేని స్థితిలో పాలకులున్నారు. ఎవరూ జిల్లా అభివృద్ధిపై ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేదు. కనీసం రాష్ట్ర విభజన తరుణంలో వెనుకబడిన జిల్లాగా గుర్తించేలా కూడా చర్యలు తీసుకోలేదు. అలా జరిగినా కొన్ని నిధులు వచ్చి ఎంతోకొంత కొన్ని రంగాల్లో చర్యలు కనిపించేవి. ఆనాడు మూడు జిల్లాల్లో నుంచి వెనుకబడిన ప్రాంతాలను వేరుచేసి ఏర్పాటు చేసిన జిల్లాను పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రజల పోరాటాల ఫలితంగా అనివార్యంగా చేపట్టిన ప్రాజెక్టులన్నీ పెండింగులోనే ఉన్నాయి. వాటి ఫలాలు కూడా అందడం లేదు. ఇప్పటికీ అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. పరిష్కారాలకు మార్గం కనిపించడం లేదు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను కూడా ఆచరణలో అమలు చేయడం లేదు. జిల్లాలో ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు పూర్తిగా లేవు. ప్రజానీకానికి తాగునీరు లేదు. ఇప్పటికీ పశ్చిమాన ట్యాంకర్లతోనే తాగునీటిని అందిస్తున్నారు. ఇంటింటికీ కుళాయి ఎండమావిగానే మారింది. కనిగిరి నియోజకవర్గంలో పలు మండలాల్లో ఫ్లోరిన్ పీడిత ప్రాంతాల్లో ఇప్పటికీ కిడ్నీవ్యాధుల బారినపడి ప్రజలు ప్రాణాలు వదులుతున్నారు. తాగునీరు మాత్రం వారికి అందించలేని దైన్యం కొనసాగుతోంది. ఒంగోలు నగరంలోనే మూడు రోజులకోసారి ▶ 2లో

ప్రకాశం ఎస్పిగా పరమేశ్వర్‌రెడ్డి



పరమేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రకాశం జిల్లా ఎస్పిగా పరమేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ ఎస్పిగా పనిచేసిన మల్లికగర్గ్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేసింది.

ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన రైతుల ఖాతాలకు నగదు జమ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఇళ్ల పట్టాల కోసం స్థలాలు కేటాయించిన రైతుల ఖాతాలో నగదు జమ చేసినట్లు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని 270 మంది రైతులు నుంచి భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. మల్లేశ్వరపురం, ఎన్. అగ్రహారం, ఎర్రజర్ల, వెంగముక్కపాలెం తదితర గ్రామంలో భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. మొత్తం 270 మంది రైతులు నుంచి 435 ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిపారు. ఆ భూములు సంబంధించి 216 మంది రైతులకు బ్యాంకు ఖాతాలకు నేరుగా సుమారు రూ.126.36 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. గతంలో రూ.30 కోట్లు జమ చేయగా ఇప్పుడు రూ.96.34 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన డబ్బులు కూడా త్వరలోనే జమ చేస్తామని తెలిపారు. నగరంలో అర్బన్ హౌసింగ్ పథకం కింద భూసేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందన్నారు.

'బాలినేని' కింకర్తవ్యం.?

- అధిష్టానం నిర్ణయాలపై నిర్వేదం
- పోటీపైనే అనాసక్తిలోకి వెళ్లిన మాజీ మంత్రి
- వైసిపిలో తారాస్థాయికి చేరిన నాయకత్వ సంక్షోభం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తాను ఏం చెప్పినా వినని అధిష్టానం తీరుపై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అధిష్టానం నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన బుధవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. తన అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోనందున ఆయన పార్టీ పెద్దలపై భగ్గుమంటున్నారు. తన కన్నా తక్కువ స్థాయి నేతల కింద ▶ 2లో



బాధ్యతలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

సంక్షేమ పథకాల అమలుకే తొలి ప్రాధాన్యత

బాధ్యతలు స్వీకరించిన జేసీ గోపాలకృష్ణ

8లో ▲

సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రథమం

వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిని గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో వైసిపి మండల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడారు. తాను కార్యకర్త స్థాయి నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తకు ఏ అవసరం ఉన్నా నా తలుపు తట్టవచ్చునని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నీరు చెట్టు పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. గ్రామాలలో జన్మభూమి కమిటీల పేరుతో నాయకులు తమ స్వలాభం కోసం ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. త్వరలో సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేస్తామన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేసి తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. తొలుత చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయం నుంచి పట్టణంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంత కిరణ్‌గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్, సర్పంచులు రామావత్ అరుణబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, బి.వెంకటేశ్వర్లు నాయక్, ఏకుల ముసలారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ కొర్రపోలు జయరాజు, వైస్ ఎంపీపీ ఆదిశేషు, జడ్‌పి కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాబీర్ బాషా, వైసిపి నాయకులు రాముల నాయక్, చేదురి కన్నా, పల్లె జాన్, కొర్రపోలు గురవయ్య, వెంకటరెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటరెడ్డి, ఐవి.సుబ్బారావు, మేడగం వెంకటరెడ్డి, కందూరు గురు, కందురి కాశీ, మైనార్టీ నాయకుడు వల్లి, ఒంగోలు సుబ్బారెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఎక్కడున్నాం.?

(మొదటిపేజీ తరువాయి)

నీళ్లు ఇస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. వ్యవసాయ రంగం అదే తీరున ఉంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. పొగాకు, శనగ, పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు బాగా పండుతున్నా వాటిని సాగు చేసే రైతులు మాత్రం అప్పుల్లో కూరుకుపోతున్నారు. రైతుల ఆత్మహత్యలు నేటికీ కొనసాగుతున్నాయి. వ్యవసాయం గిట్టుబాటు కానందున రైతులు పొలాలు వదిలేస్తున్నారు. వ్యవసాయ కూలీలు వాటిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. వారి పరిస్థితీ అధ్వానంగానే మారింది. ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేవు. సాగునీటి విషయానికి వస్తే జిల్లాలో 16 లక్షల ఎకరాల్లో సాగుకు అనుకూలమైన భూమి ఉన్నా కేవలం 5 లక్షల ఎకరాల్లోనే ఖరీఫ్ లేదా రబీ సీజన్‌లో సాగులో ఉంటుంది. మిగతా సాగర్ ఆయకట్టులో ఉన్న భూమికి సాగునీరు సక్రమంగా అందడం లేదు. 70 వేల ఎకరాలు చివరి భూముల ఖాతాల్లో పడి నీరందడం లేదు. ఇతర మెట్టపంటలు సాగు చేసుకుంటున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. రెండు సొరంగాలు ఇటీవల పూర్తయ్యాయి. నీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. 1996లో దీనికి శంకుస్థాపన చేయగా ఇప్పటికీ పూర్తికాలేదు. దాని ఫలాలు రైతులకు అందలేదు. గుండ్లకమ్మ పూర్తయినా నిర్వహణ లోపంతో రైతులకు కడగండ్లే మిగిల్చింది. ఇంకా అనేక ప్రాజెక్టులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ఉపాధి విషయానికి వస్తే జిల్లాలో కనిగిరి, దొనకొండ వద్ద ప్రతిపాదించిన పరిశ్రమలు కూడా రాలేదు. కేవలం గ్రానైట్ రంగమే ఉపాధికి అవకాశం ఉన్నా స్థానిక కూలీలు కేవలం 20 శాతమే ఉన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులే ఇక్కడ పనిచేస్తారు. పాలిషింగ్ యూనిట్లు రెండు వేలకు పైగా ఉన్నా వివిధ కారణాలతో సంక్షోభంలో ఉన్నవే మూడొంతులున్నాయి. ఇంకా ఆక్వా, పొగాకు, పండ్లతోటల ద్వారా కొంత ఉపాధి ఉంది. ఈ రంగాల్లోనూ నిస్తేజం ఉంది. గ్రామాల్లో ఉపాధి లేక పశ్చిమాన అనేక ప్రాంతాల నుంచి హైదరాబాద్, బెంగుళూరుకు వలసలు పోతూనే ఉన్నారు. అనేక గ్రామాల్లో జనం లేని పరిస్థితి కనిపిస్తుంది. చదువుకున్న యువకులకు ఇక్కడ ఉపాధి లేదు. ఇంజనీరింగ్ కాలేజీలు సంక్షోభంలో పడ్డాయి. ఇతర రాష్ట్రాలు, పట్టణాలకు ఏదో చిన్నచిన్న ఉద్యోగాలు చూసుకొని పోతున్నారు. పండ్ల తోటల నుంచి జ్యూస్ పరిశ్రమలకు, సుబాబుల్ జామాయిల్‌తో పేపరు పరిశ్రమలకు, పత్తి వల్ల జిన్నింగ్, ఆక్వా రంగం నుంచి కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లు, పొగాకు సజావుగా ఉంటే ప్రాసెసింగు యూనిట్లు పెట్టడానికి వీలుంది. ఎగుమతులకు అవకాశాలున్నాయి. ఇక సామాజికవర్గాల విషయానికి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి అధ్వానంగానే మారింది. సంక్షేమ పథకాల కోసం ఎదురుచూసే పరిస్థితి. వృత్తుల నుంచి కొందరు బయటపడ్డారు. ఆధునిక పనిముట్లతో పనులు చేసుకుంటున్నారు. వారికి చేయూత లేదు. అభివృద్ధి కోసం ఏర్పాటైన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పోరేషన్లు నిర్వీర్యమయ్యాయి. ఈ వర్గాలకు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం వేసవిలో ఊరటగా ఉంది. ఇంకా సముద్రతీరంలో ఉన్న మత్స్యకారుల జీవితాలు అదే స్థితిలో ఉన్నాయి. రామాయ పట్నం పోర్టు ఎట్టకేలకు చేపట్టారు. కొత్తపట్నం, చీరాల ప్రాంతాల్లో ఓడరేవులకు అవకాశాలున్నాయి. విమానాశ్రయాల ఏర్పాటు ప్రకటనలకే పరిమితమైంది. ఇలా ఏ రంగంలో చూసినా శాశ్వత అభివృద్ధికి చర్యలు పూజ్యమయ్యాయి. జిల్లా సమగ్రాభివృద్ధికి 2024లో జరిగే ఎన్నికల్లో గెలిచే ప్రజాప్రతినిధులైనా దృష్టి సారిస్తారని ఆశిద్దాం..

నేడు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-మార్కాపురం



మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత, డాక్టర్ మీర్జా షంషీర్‌అలిబేగ్ నియమితులయ్యారు. ఎఎంసి చైర్మన్ షంషీర్‌అలిబేగ్, డైరెక్టర్లు నియమితులైన వారు శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

'బాలినేని' కింకర్తవ్యం?

(మొదటిపేజీ తరువాయి)

తాము పనిచేయాలా? అనే భావనలో ఉన్నారు. ఇదే విషయాన్ని తన సన్నిహితులతోనూ చెబుతున్నారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డిని రీజినల్ కోఆర్డినేటర్‌గా వద్దందే వద్దంటూ బాలినేని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పార్టీ పెద్దలు బాలినేనికి ఉదయం చెప్పిన మాటలు సాయంత్రానికి మారిపోయాయి. ముందు రీజినల్ కోర్డినేటర్ నియామకాన్ని నిలిపినట్లు పార్టీ నేతలు చెప్పారు. రాత్రి పార్టీ నిర్ణయాన్ని ప్రకటించారు. సిఎం జగన్ ఆదేశాల మేరకు అంటూ చెవిరెడ్డి భాస్కరరెడ్డిని రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. దీంతో తీవ్ర అసహనంలో ఉన్న బాలినేని తనను కలిసిన నేతలకూ ఏమీ చెప్పలేకపోయారు. రాత్రికి హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారంనాడు పార్టీ నేతలు ఫోన్ చేసినా ఎవరికీ అందుబాటులో లేరు. దీంతో కొందరు హైదరాబాద్‌కు వెళ్లారు. మంతనాలు సాగిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలపై బాలినేని తీవ్ర నిర్వేదంలో ఉన్నారు. మరో వైపు పార్టీ పెద్దలు కూడా ఆయనతో మంతనాలు సాగిస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. జిల్లాలో మాత్రం బాలినేని భవితవ్యంపై పలు రకాలుగా చర్చలు సాగుతున్నాయి. ఒక వైపు ఇళ్ల స్థలాలకు నిధులు తెచ్చుకున్నారు. వాటిని గురువారం నాడు రైతుల ఖాతాలకు జమ చేశారు. బాలినేనికి అవాంతరాలు తొల గాయనుకుంటున్న సమయంలో రీజినల్ కోఆర్డినేటర్.. ఎంపీ టిక్కెట్టు వ్యవహారాలను తెరపైకి తెచ్చారు. మళ్లీ ఆయన అధిష్టానంపై అలకబూనే పరిస్థితికి తెచ్చారని బాలినేని అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న పరిణామాలపై అందరిలోనూ ఆందోళన కలుగుతోంది. ఏం జరుగుతుందన్నదీ స్పష్టత లేదు. మరో వైపు బాలినేని పోటీ చేయడానికే ఆసక్తిగా లేరనే ప్రచారం కూడా ఉంది. అధిష్టానం ఏ మాత్రం గౌరవం లేకుండా చేస్తున్నప్పుడు తలవంచుకొని పోవడం సాధ్యం కాదనే చర్చ కూడా సాగుతోంది. ఇక అధిష్టానం బాలినేని మాట వినకపోవడానికి ఇక్కడ తమ కోటరీని పెట్టుకోవడానికేనన్న చర్చ సాగుతోంది. ఇక్కడున్న ఆర్థిక వనరులు సహజ సందపపై దృష్టి సారించారనే ప్రచారం నేతల మధ్య నడుస్తోంది. రామాయపట్నం పోర్టు, గ్రానైట్ గనులను నేరుగా సిఎం జగన్‌కు అత్యంత దగ్గరగా ఉన్న నేతల కనుసన్నల్లో ఉండేలా చేసేందుకు చెవిరెడ్డిని జిల్లాకు తెస్తున్నారనే చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది. బాలినేని తీవ్ర అసంతృప్తితో ఉన్నందున అధిష్టానం తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటుందా? మరేమైనా మార్పులు చేర్పులు చేస్తుందా? అనేదీ చూడాలి. ఎంపీ టిక్కెట్టు మాగుంటకు లేదని స్పష్టమవుతోంది. చెవిరెడ్డి భాస్కరరెడ్డినే ఎంపీగా పెడతారా? లేక ఆఖరు నిమిషంలో మరెవరినైనా రంగంలోకి దించుతారా? అనేదీ చూడాలి. ఏదేమైనా వైసిపిలో నాయకత్వ సంక్షోభం తారాస్థాయికి చేరింది.

మాజీ మంత్రి ఆరేటికి సతీవియోగం

ప్రజాశక్తి-సంతనూతలపాడు.



ఆరేటి కోటమ్మ (ఫైల్)

సంతనూతలపాడు మండలం ఎండ్లూరు గ్రామానికి చెందిన మాజీ మంత్రి ఆరేటి కోటయ్యకు సతీవియోగం కలిగింది. ఆయన సతీమణి ఆరేటి కోటమ్మ (75) వయోభారంతో గురువారం ఒంగోలులో మృతి చెందారు. కోటమ్మ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించిన రిటైర్డ్ అయ్యారు. ఆమెకు ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు కోటమ్మ అంత్యక్రియలు వారి స్వగ్రామమైన ఎండ్లూరులో శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలులోని జీజీహెచ్ హెడ్ నర్స్ సిహెచ్. అనంతలక్ష్మికి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి లభించింది. జీజీహెచ్ నెల్లూరు నుంచి హెడ్ నర్స్ వి.మల్లీశ్వరి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా ఒంగోలు జిజిహెచ్‌కు వచ్చారు. వీరిద్దరూ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం జిజిహెచ్ సిబ్బంది, నర్సులు పుష్పగుచ్ఛాలు అందజేసి.. శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

'విజయశ్రీ'లో రాయితీపై వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు

దేవరకొండ సుబ్బయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు విజయశ్రీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక విజయశ్రీ హాస్పిటల్ గురువారం 50 శాతం రాయితీపై వైద్యపరీక్షలు నిర్వహించారు. రాయితీ వైద్యపరీక్షలకు 42 వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీన 50 రాయితీపై వైద్యపరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు



లోకేష్‌తో కందుల నారాయణరెడ్డి

లోకేష్‌కు స్వాగతం పలికి కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం కోసం గురువారం విచ్చేశారు. విషయం తెలుసుకున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొద్దిసేపు మార్కాపురం నియోజకవర్గంలో టిడిపి పరిస్థితిపై వారు చర్చించినట్లు తెలిసింది.



నివాళుర్పిస్తున్న దద్దాల

రమణారెడ్డికి దద్దాల నివాళి

పిసిపల్లి : మాజీ సర్పంచి బోడె ముగిరెడ్డి మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దనాల నారాయణయాదవ్ గురువారం బోడె ముగిరెడ్డి నివాస గృహానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో ఎంపిపి అత్యల జఫన్యా, వైసిపి నాయకుడు ఒకేరెడ్డి, కనిగిరి జడ్‌పిటిసి కస్తూరిరెడ్డి, పిసిపల్లి సర్పంచి టి.మరియమ్మ, పిసిపల్లి సొసైటీ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, దుంపా మాలకొండయ్య, లింగాలదిన్నె లక్ష్మీ నరసింహారెడ్డి,.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విరాళాలు అందించాలి

ప్రజాశక్తి-దొనకొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు సాగిస్తున్న సిపిఎంకు ప్రజలు విరాళాలు అందించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. స్థానిక వివిపురంలో ఉద్యమ నిధి కోసం సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. విరాళాలను సేకరణను ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలన్నారు. జిల్లాలో కరువు, వలసలు నివారించి, ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణం చేపట్టాలని అందుకోసం సిపిఎం అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. పెరుగుతున్న ధరలు అరికట్టాలని, పాలకులు ప్రజలపై మోపుతున్న భారాలను నిలువరించాలని, ప్రభుత్వ త్యాగాలతో స్థాపించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతుంటే సిపిఎం అడ్డుకు నేందుకు అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ఈనెల 1 నుంచి 10 వరకూ ప్రజల వద్ద విరాళాలు సేకరించనున్నట్లు తెలిపారు. ప్రజలు విరివిగా విరాళాలు ఇచ్చి ఆదరించాలన్నారు. ప్రజా ఉద్యమాలను బలపర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం దర్శి నియోజకవర్గ నాయకులు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కార్యకర్తలు కుందుర్తి అనిల్, కర్ణా కృష్ణ, అంజిబాబు, మేళం సంతోష్, బండారు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



దొనకొండలో విరాళాలు వసూలు చేస్తున్న నాయకులు

కొండపి: ప్రజా ఉద్యమాల కోసం నిధి సేకరిస్తునట్లు సిపిఎం మండల నాయకులు కెజి.మస్తాన్ తెలిపారు. మండల పరిధిలోని మిట్టపాలెం గ్రామంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 15 వరకూ ప్రజలకు వద్దకెళ్లి నిధులు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వందనం, పిచ్చయ్య, ఎస్తేరమ్మ, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండపిలో విరాళాలు వసూలు చేస్తున్న నాయకులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన మేదర సంఘం నాయకులు గురువారం టిడిపిలో చేరారు.మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో మేదర సంఘం నాయకులు వాసం పెంచలయ్య, మైలపల్లి శ్రీనివాసులు, మైలపల్లి రమణ, టంగుటూరు శ్రీను, కాకర్ల రంగ సుబ్బయ్య, కోలే వెంకటేశ్వర్లు, కాకర్ల రంగప్రసాద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బూనెబోయిన చంద్రశేఖర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణానికి చెందిన 35 కుటుంబాల వారు బుధవారం వైసిపిలో చేరారు. వైసిపి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి సీనియర్ నాయకులు సన్నపురెడ్డి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరిన వారు దద్దాల గెలుపునకు కషి చేస్తామన్నారు. వెసిపిలో చేరిన వరిలో ఇండ్ల శ్రీకాంత్, పల్లావుల లక్ష్మీరెడ్డి, బండి సందీప్, చందా వెంకటేష్, షేక్ అస్సలామ్, షేక్ సందాని, కుమ్మరి కుంట విజయ్, షేక్ ఖలీల్, ప్రసాద్, భార్గవ్, కళ్యాణ్రాజేష్, నారాయణ, రమణ, రంగా స్వామి, చరణ్, వెంకటేశ్వర్లు మహేష్ మహేందర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ ప్రసాద్ రెడ్డి , జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపిపి దంతులూరి ప్రకాశం, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యరావు, వైసిపి నాయకులు వెంకట రత్నం, గోపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఎంఇఒకు కార్మికుల వినతి

హనుమంతునిపాడు : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండలం కమిటీ నాయకులు పోలిచర్ల చెన్నమ్మ, సుబ్బులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ-2 రమణయ్యకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ఛార్జి రూ.20 రూపాయలు ఇవ్వాలన్నారు.గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

సుగుణమ్మ బాధ్యతల స్వీకరణ

మద్దిపాడు : మద్దిపాడు ఎంపిడిఒగా టి. సుగుణమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు.ఈమె గుంటూరు జిల్లా చుండూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒను ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఎంపిడిఒ కార్యాలయ సుగుణమ్మకు స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఎడ్లపాడుకు బదిలీ అయ్యాడు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శానంపూడి గ్రామానికి చెందిన మందలపు శివకష్ణ, సుధారాణి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని తాతయ్యకాలనీ గిరిజన పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రాత పుస్తకాలు, స్టేషనరీ, పండ్లు గురువారం పంపిణీ చేశారు. గత పది సంవత్సరాల నుంచి శానంపూడి గ్రామానికి చెందిన యువత తమ సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నట్లు పంతగాని వెంకటేశ్వర్లు తెలిపారు. రోటరీ క్లబ్ రీజనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జెట్టి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఊరికి దూరంగా ఉంటూ పలు అభివద్ధి పథకాలకు నోచుకోని గిరిజనులను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలల విద్యాభివద్ధికి రోటరీ క్లబ్ తరపున తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కత్తి మాధురి, అంగన్‌వాడీ కార్యకర్త పొట్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు, పండ్లు అందజేస్తున్న దాతలు

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ' : గూడూరి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

టిడిపితోనే భవిష్యత్‌కు గ్యారెంటీ సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. మండలంలోని వైచెర్లోపల్లి బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, మాబు, శేషాద్రి, సుబ్బరత్నం, శ్రీనివాస యాదవ్, మల్లయ్య, సుబ్బరాయుడు, జనసేన నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

పచ్చాకు ట్రాక్టర్ బోల్తా

- మహిళ మృతి
- మరో ముగ్గురి గాయాలు

మద్దిపాడు : పచ్చాకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటనలో ఓ మహిళ మతి చెందింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లి-గురువారెడ్డి పాలెం డొంకలో పొలాల వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం... రాచవారిపాలెం గ్రామానికి చెందిన కూలీలు పచ్చాకు కొట్టుడుకు వెళ్లారు. పచ్చాకు కొట్టుకొని ట్రాక్టర్‌పై లోడ్ చేసుకొని వస్తున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సుదర్శ శోభ (40) మతి చెందింది. పోగులమూడి శుభా ఆంజనేయులు, యాదాల మాలమ్మ మరో వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపాడు.



మృతిచెందిన శోభ

నేడు 'దద్దాల' పరిచయ కార్యక్రమం

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్లలో శుక్రవారం ఉదయం వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జడ్‌పిటిసిల సంఘం జిల్లా సంఘ అధ్యక్షుడు, వెలిగండ్ల జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి తెలిపారు. వైసిపి కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు.. ఈ సందర్భంగా గుంటక తిరుపతిరెడ్డి దద్దాల నారాయణయాదవ్ పరిచయ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పోల్లా సుబ్రహ్మణ్యం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎలికా రమణయ్య, నాగూరుయాదవ్, ఎఎంసి డైరెక్టర్ బొబ్బా వెంకటరెడ్డి, గజ్జల నాగేశ్వరరెడ్డి, దేవ సహాయం, సర్పంచులు తాతపూడి సురేష్, గజ్జల నాగేశ్వరరావు, ఆదిరెడ్డి, కె.వెంకటరామయ్య పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ఇంటింటికీ సిపిఎం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలో ఈనెల 3,4 తేదీల్లో ఇంటింటికీ సిపిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి. కేశవరావు తెలియజేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎంను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఇంటింటికీ సిపిఎం కార్యక్రమం ద్వారా వస్తున్న సిపిఎం శ్రేణులకు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు.

రాజకీయ నాయకులతో సమీక్ష

ప్రజాశక్తి-కొండపి

పోలింగ్ కేంద్రానికి రావడానికి వీలులేని అంగవైకల్యం కలిగిన వారికి వచ్చే ఎన్నికల్లో హోం ఓటింగ్ సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారథముని తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో అధికారులు , వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారథముని మాట్లాడుతూ ఓటరు జాబితాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా పొరబాట్లు ఉంటే తమకు తెలిపితే వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది , రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి : సిపిఐ

ప్రజాశక్తి-దర్శి

భారతదేశాన్ని కాపాడాలంటే బిజెపిని ఓడించడమే ఏకైక మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్. నారాయణ తెలిపారు. గుజ్జుల సరళాదేవి భవన్‌లో దర్శి నియోజకవర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశం సుంకర అంజిరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. కేవలం మోడీ అజెండా మాత్రమే అమలు అవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో మూడో సారి మోదీ గెలిస్తే ఇక ఎన్నికలను పూర్తిగా రద్దు చేసినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదపాకుల రమేష్,కరుణానిధి, బాలయ్య, రామయ్య, సింగరకొండ శ్రీను, ఇత్తడి ప్రభాకర్, సుబ్బయ్య ,అరుణ, మహాలక్ష్మీ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సుబ్బలక్ష్మమ్మకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఆచార్య రంగ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న సబ్బులక్ష్మమ్మ నీతి నిజాయతీ కలిగిని వ్యక్తి అని ప్రిన్సిపల్ సైంటిస్టు ప్రమీలరాణి కొనియాడారు. సుబ్బలక్ష్మమ్మ పదవీ విరమణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీలరాణి మాట్లాడుతూ కేంద్రంలో 36 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన సుబ్బలక్ష్మమ్మ అందరి మన్ననలు పొందారని అన్నారు. అనంతరం సుబ్బలక్ష్మమ్మకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజేష్ చౌదరి, జూపల్లి కోటేశ్వరరావు, ఏడుకొండలు రాజు, నిహారిక, పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, టైమ్ స్కేల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



హనుమంతరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - బాపట్ల

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో వివిధ స్థాయిలో మూడున్నర దశాబ్దాల పాటు సేవలు అందించి బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందిన పెట్లూరి హనుమంతరావు సేవలు అభినందనీయమని బ్యాంక్ రీజనల్ మేనేజర్ వీరారెడ్డి అన్నారు. హనుమంతరావు ఉద్యోగ విరమణ అభినందన సభ బ్యాంకు ఆధ్వర్యంలో ఎన్జీఒ హెూంలో గురువారం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్‌గా బ్యాంకు ఖాతాదారులకు, పొదుపు సంఘాల మహిళలకు ఖాతాల సేకరణకు విశిష్టమైన కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నాయకులు బోడ శ్రీనివాసరావు, బ్యాంక్ అధికారులు ఆంజనేయులు, సుభాష్ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న గౌరీ అమర్నాథ్

అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ ప్రభుత్వం ప్రచారాల్లో ముందుంటూ పరిపాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడికొండ దయా బాబు అన్నారు. టిడిపి క్లస్టర్, బూత్ ఇన్చార్జిల ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతుల్లో ఆయనతోపాటు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ పరిపాలనలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అన్ని వర్గాల మన్ననలను పొందుతూ పనిచేసిందని అన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 27 పథకాలను రద్దుచేసి దళితులకు వైసిపి అన్యాయం చేసిందని అన్నారు. బీసీలకు 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24శాతానికి తగ్గించి 16864 ప్రజా ప్రతినిధులు ఎన్నికకు అర్హత కోల్పోయేలా చేసిందని అన్నారు. మంచి పరిపాలన అందించే టిడిపి ప్రభుత్వ పరిపాలనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనర్స్ కర్పూరపు వెంకటేష్, సూరిని రామాంజనేయరెడ్డి, బిట్రా చైతన్య కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ పురిపాటి శేఖర్ బాబు, పట్టణ టిపిడబ్ల్యూ అధ్యక్షుడు కట్టెం వంశీకృష్ణ, అన్నం హనుమంతరావు, నరాల తిరుపతి రాయుడు, కారుసాల శ్రీనివాస్, కొమ్ము మహేంద్ర బాబు, కుంచాల రామాంజనేయులు, తన్నీరు మాలకొండయ్య పాల్గొన్నారు.

ఎంపిడిఒగా కాశయ్య

ప్రజాశక్తి - సంతమాగులూరు



ఎంపిడిఒ కాశయ్య

నూతన ఎంపిడిఒగా జి కాశయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఒగా ఈఒపిఆర్‌డి ఎన్ శివరామ ప్రసాద్ కొనసాగారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఎంపీడీఒగా పని చేస్తున్న కాశయ్య బదిలీపై వచ్చారు. ఆయనకు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.



ఎంపీడీఒ లక్ష్మీ కుమారి

కొల్లూరు : నూతన ఎంపీడీఒగా బిఎం లక్ష్మి కుమారి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మైలవరం నుంచి కొల్లూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ఐ సత్యనారాయణ కృష్ణాజిల్లా తోట్లవల్లూరుకు బదిలీపై వెళ్లారు.

రెండో రోజుకు చేరిన యుటిఎఫ్ దీక్ష

ప్రజాశక్తి - బాపట్ల



యుటిఎఫ్ ఉపాధ్యాయుల దీక్ష

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక బకాయిల సాధనకై యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన నిరాహార దీక్ష గురువారం 2వ రోజుకు చేరింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆర్థిక పరిష్కారాని ప్రభుత్వానికి కనీస స్పందన కరువైందన్నారు. దీక్షలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హరిబాబు, వర్ధన్, సతీష్, శ్రీనివాస్, రహంతుల్లా, రాజేష్, ఫజులుద్దిన్ మహమ్మద్, రాజేష్, ఉదయ కుమారి, నాగలక్ష్మి, సుజాత కూర్చున్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి చెంచయ్య, హరిబాబు, కొక్కిలిగడ్డ రాజేష్, ఆర్‌వి శ్రీనివాసరావు, ఎస్‌కె రహమతుల్లా, ఫజులుద్దీన్, సతీష్, గొర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోరాడి సాధించుకున్నాం

ప్రజాశక్తి - చీరాల



కేక్ కటింగ్ చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిజిబెత్ రేఖ

స్థానిక అంబేద్కర్ భవన్‌లో అంగన్‌వాడి కార్యకర్తల విజయోత్సవ సభ గురువారం నిర్వహించారు. సభలో అంగన్‌వాడి కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎలిజిబెత్ రేఖ మాట్లాడుతూ అంగన్‌వాడి కార్యకర్తలు చేసిన పోరాటం ఇతర కార్మికులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. డిసెంబర్ 12న ప్రారంభించిన ఉద్యమంలో అంగన్‌వాడి కార్యకర్తలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. సమ్మె జరగకుండా ప్రభుత్వం ఎన్నో కుట్రలు చేసిందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పోలీసులు, సచివాలయ సిబ్బంది చేత అంగన్‌వాడి కార్యకర్తలను ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ కుట్రలను ఎదుర్కొనే లాగా వామపక్ష పార్టీలు, ప్రజల పూర్తి మద్దతుతో పోరాటాన్ని తీవ్రతరం చేశామని అన్నారు. ప్రభుత్వానికి ఎదురెళ్లి హామీలను నెరవేర్చే విధంగా ప్రభుత్వానికి కళ్ళు తెరిపించామన్నారు. అంగన్‌వాడిలతో పెట్టుకుంటే ఏం జరుగుతుందోనని 42రోజులపాటు జరిగిన ఉద్యమం చూపిందని అన్నారు. భవిష్యత్తులో కూడా కార్యకర్తలు అందరూ కలిసి హక్కుల సాధనకై పోరాడుతామని అన్నారు. సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు, కార్యదర్శి ఎం వసంతరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ జానీ భాష, అంగన్‌వాడి యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సమాజ సేవలో ఎన్జీఎస్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చల్లారెడ్డిపాలెం గ్రామంలో రైట్ నెట్వర్క్ హాస్పిటల్, ఎన్జిఎస్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు గురువారం నిర్వహించారు. శిభిరానికి విశేష స్పందన కనిపించింది. డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ఎస్‌కె నాగూర్ బాబు, డాక్టర్ సురేష్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. క్యాంపులో 135కిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి రైట్ నెట్వ వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. 82మందికి కంటి పరీక్షలు నిర్వహించి 27మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఫౌండేషన్ డైరెక్టర్ వక్కలగడ్డ మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో యారం మమత, సుమన్, ఎ ప్రవచన, ఎస్‌కె మాబుల, ఎస్ స్వాతి, ఎ సాయి, కె రాజలక్ష్మి, పిట్టు వెంకటేశ్వర్లు, బుర్ల తిరుపతయ్య, పిట్టు పోతురాజు, చిప్పలపల్లి పోతురాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల



ధర్నా చేస్తున్న ఎంపీటీఎఫ్ ఉపాధ్యాయులు

రాష్ట్రంలో మున్సిపల్ పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద ఎపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఎ శేఖర్ బాబు అధ్యక్షత వహించిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి సోషలిజం మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ తక్షణమే అమలు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని అన్నారు. పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉద్యోగ, ఉపాధ్యాయుల మాదిరి ఏపీపీఎస్సీ పరీక్షకు వయోపరిమితిని సడలించి మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు వై నేతాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని నూతన పాఠశాలలు నెలకొల్పాలని కోరారు. డిఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు తక్షణం భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సబ్ కమిటీ సభ్యులు జంపాని శ్రీనివాసరావు, బి నాగాంజనేయులు, డి రవి, చెంచురామారావు, చెన్నకేశవులు, కోటయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు తేలప్రోలు శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్ బాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రహంతుల్లా, వెంకట రత్నం, ప్రశాంత్, నారాయణ, ప్రసాద్ చీరాల, బాపట్ల, రేపల్లె మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న అతిధులు

సుబ్బారావు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా సేవలందించిన విసిహెచ్ సుబ్బారావు సేవలు ఆర్శమని చీరాల ఎబిసిడబ్ల్యుఓ పేర్కొన్నారు. స్థానిక బిసి హాస్టల్ ఆవరణలో సుబ్బారావు ఉద్యోగ విరమణ సత్కార సభలో ఆయన మాట్లాడారు. హాస్టల్ నిర్వహణ తీరును సుబ్బారావును అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం సుబ్బారావు, యశోద దంపతులను ఘనంగా సత్కరించారు. సభకు అద్దంకి వార్డెన్ షేక్ ఎండి ముస్తఫా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మేదరమెట్ల, ద్రోణాదుల, వేటపాలెం, సంతమాగులూరు, ముప్పవరం, బాపట్ల, అద్దంకి వార్డెన్లు టి వెంకట్రావు, బి హరిప్రసాదరావు, డి పద్మావతి, ఎం సత్యబాబు, డి పద్మావతి, కె వెంకట్, యు పద్మావతి, సిబ్బంది వెంకటేశ్వర్లు, నాయక్, అశోక్ కుమారి, వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రామకృష్ణ, సిబ్బంది

టెక్ మహీంద్రాకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు టెక్ మహీంద్రా కంపెనిలో ఉద్యోగాలకు 30మంది ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. 2001లో స్థాపించిన తమ కళాశాల ఎఐసిటిఇ, కాకినాడ జెఎన్‌టియు శాశ్వత గుర్తింపు, 3 సార్లు ఎన్‌బిఎ గుర్తింపు, రెండు సార్లు నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు. యుజిసి 2 (ఎఫ్), 12(బి) ద్వారా గుర్తింపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా 'ఎ' గ్రేడ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ద్వారా శాశ్వత గుర్తింపు, ట్రైమ్స్ ఆఫ్ ఇండియా, సిఇజిఆర్ సంస్థల సర్వేద్వారా భారత దేశములోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల్లో ఒకటిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంజినీరింగ్ విద్యను అందజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు తెలిపారు. చదువులతోపాటు అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ బిటెక్ నందు 9 కోర్సులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంబిఎ, ఎంసిఎ, ఎం టెక్ వంటి ఉన్నత విద్యాకోర్సులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల టెక్ మహీంద్రా కంపెనీ సాఫ్ట్వేర్ ఇంజినీర్ల కొరకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో బిటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న 30మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ పరీక్షకు 331మంది హాజరు కాగా అందులో 166మంది రెండవ రౌండుకు అర్హత సాదించగా, 2వ రౌండులో 88మంది టెక్నికల్ రౌండుకు అర్హత సాధించారు. టెక్నికల్ రౌండ్లో 36మంది హెచ్‌ఆర్ రౌండుకు అర్హత సాధించారు. అందులో 30మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. సిఎస్ఇ నుండి 19మంది. ఇసిఇ నుండి నలుగురు, ఎఐఎంల్ నుండి నలుగురు, ఐటి నుండి ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రు.3.62లక్షల వేతనం, ఇతర సౌకర్యాలు ఇస్తారని ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సిఎస్ఇ, ఇసిఇ, ఎఐఎంఎల్, ఐటి హెచ్‌ఒడిలు పి హరిణి, కె జగదీష్‌బాబు, సి హరికిషన్, ఎస్ ఇంద్రనీల్ అభినందనలు తెలిపారు.

అర్బన్ సీఐగా రాజశేఖరరెడ్డి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అర్బన్ సీఐగా ఎస్‌వి రాజశేఖరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముసలం శ్రీనివాసరావును చినగంజం ఎస్‌ఐగా బదిలీ చేశారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకామయ్మ

ప్రజాశక్తి-దొనకొండ

మహిళల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. దొనకొండ సచివాలయం వద్ద డ్వాక్రా మహిళలకు నాల్గో విడత అసరా చెక్కులు గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఎంపిడిఒ వసంతరావునాయక్ అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో బూచేపల్లి వెంకామయ్మ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అక్కాచెల్లెళ్ల కష్టాలు తెలుసుకున్న సిఎం జగన్ అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలో వచ్చిన తర్వాత హామీ మేరకు డ్వాక్రా మహిళలకు నాలుగు విడతలుగా ఆసరా చెక్కులు అందజేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు శివప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళలకు అనేక పథకాలు అందించిన ఏకైక సిఎం జగనే మోహన్‌రెడ్డేనని తెలిపారు. 20 ఏళ్లుగా దర్శి నియోజక వర్గ ప్రజలకు తాము అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 623 గ్రూపులకు అసరా పథకం చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వసుందర,ఎంపిపి ఉషారాణి, నాయకులు కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎంపిఎం వెంకటేశ్వరరావు, తొలుత బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.



చెక్కులు అందజేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



కిరణ్‌కుమార్‌రెడ్డితో కోలా ప్రభాకర్

మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో 'కోలా' భేటీ!

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోలా ప్రభాకర్ గురువారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ప్రస్తుతం నెలకొన్న రాష్ట్ర రాజకీయాలపై విస్తతంగా చర్చించారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ తహశీల్దారు సిహెచ్.ఉష పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. అందులో భాగంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తహశీల్దారు ఉషను గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, ఎఎస్ఒ శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రవీన్, తన్నీరు తిరుమలరావు, విఆర్ఒ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపుతా : ఉగ్ర

ప్రజాశక్తి -కనిగిరి

తనను ఆదరిస్తే కనిగిరి నియోజకవర్గాన్ని అభివద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మనేని శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన టిడిపి విస్తత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ సరైన పాలకుడిని ఎన్నుకొకపోతే భవిష్యత్తు తరాలకు నష్టం కలుగుతుందన్నారు. ప్రతి టిడిపి కార్యకర్త 100 ఓట్లకు బాధ్యత తీసుకుని పనిచేస్తే కనిగిరి నియోజకవర్గంలో టిడిపి జండాను ఎగుర వేయవచ్చునని తెలిపారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు అందరినీ సమన్వయంతో కలుపుకుపోవాలన్నారు. వైసిపి అరాచక పాలన, విధ్వంసాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్లి రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి అందరూ కషి చేయాలన్నారు.అనంతరం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టాప్ 5లో నిలిచిన బూత్ ఇన్‌ఛార్జులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, చింతలపూడి తిరుపాలు, ఐవి.నారాయణ, గుడిపాటి ఖాదర్, బుల్ల బాలబాబు, కరణం అరుణ, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, సద్గురు, జాన్సన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ఎంపిడిఒ బ్యాధతల స్వీకరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ఎంపిడిఒగా టి. నాగేష్ కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న షేక్ జమీఉల్లా నెల్లూరు జిల్లా భోగోలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా పొదలకూరు ఎంపిడిఒగా విధులు నాగేష్‌కుమారి బాధ్యతలు స్వీకరించారు.

జడ్‌పిటిసి 'మేకల' జన్మదిన వేడుకలు

సిఎస్ పురంరూరల్ : జడ్‌పిటిసి మేకల శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వైసిపి యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజు రమణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజు అన్నయ్య, నాయకులు ఆలా లక్ష్మయ్య, సంగిశెట్టి వాసు, తోట రమేష్, సంగిచెట్టి మధు, రాగసాని పుల్లయ్య, బి.ఆదినారాయణ, కేతన పోయిన పెద్దయ్య, బత్తుల కొండయ్య, కె.రమణయ్య, బోయిన మహేంద్ర, జి. తిరుపతయ్య పాల్గొన్నారు

విద్యార్థులు కష్టపడితే ఉన్నత శిఖరాలకు..

- సినీ హీరో సంపూర్ణేష్ బాబు
- ఉత్సాహంగా శ్రీహర్షిణి వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్న శిఖరాలకు చేరుకోవచ్చని సినీ హీరో, బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు తెలిపారు. ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. హర్షిణి విద్యాసంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బాలుర క్యాంపస్ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే 1000 మంది విద్యార్థులు చేరినందుకు తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరీక్షలలో ఉత్తమ ప్రతిభకనపరచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ కరణం నారాయణ, దివి రమేష్, ఎఒ శేఖర్ బాబు, జిఎం శివరాం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి. ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపల్ వీరేశలింగం, ఎఒ ర్యాంకర్ శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంపూర్ణేష్‌బాబు , తదితరులు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

త్రిపురాంతకం సిఐగా సుబ్బారావు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం సిఐగా సుబ్బారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ త్రిపురాంతకం సిఐగా పని చేసిన బి. పాపారావు నెల్లూరు జిల్లా గూడూరు వన్‌టౌన్ సిఐగా బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో సుబ్బారావు సిఐగా బాధ్యతలు చేపట్టాడు.

చీమకుర్తి సిఐగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి సిఐగా దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా ఎస్ఐకు పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ దుర్గాప్రసాద్ ఎస్‌పి మల్లిక గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కనిగిరి సిఐగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి సిఐగా దాసరి వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వరరావును కనిగిరి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుతమైన వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కనిగిరిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

యర్రగొండపాలెం ఎస్ఐగా సుదర్శన్

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం ఎస్ఐగా త్రిపురాంతకం సుదర్శన్‌ను నియమిస్తూ జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రాజేష్ పొన్నలూరు బదిలీ అయ్యాడు.

ఎస్ఐగా 'అబ్దుల్ రెహమాన్'

మార్కాపురం : మార్కాపురం పట్టణ ఎస్ఐగా అబ్దుల్ రెహమాన్ నియమితులయ్యారు. విఆర్‌లో ఉన్న రెహమాన్ పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. మొన్నటి వరకు ఇక్కడి ఎస్ఐగా పని చేసిన ఎస్ఐ పి.కోటేశ్వరరావును విఆర్‌కు పంపారు. మార్కాపురం డిఎస్‌పి జి.వీరరాఘవరెడ్డి అనంతపురం బదిలీ అయ్యారు. మార్కాపురం డిఎస్‌పిగా బాల సుందరరావు ఇక్కడి రానున్నారు.

కొమరోలు ఎస్ఐగా కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు ఎస్ఐగా కెవి. కోటేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.సుబ్బరాజుకు సిఐగా ఉద్యోగోన్నతి వచ్చింది. దీంతో ఆయన స్థానంలో ఒంగోలు విఆర్‌లో ఉ కెవి. కోటేశ్వరరావును కొమరోలు ఎస్ఐగా నియమించారు.

ఎండిపిఒగా నరసింహారావు

కొమరోలు : కొమరోలు ఎంపిడిగా నరసింహారావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న నరసయ్య గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో గుంటూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న నరసింహారావుకు కొమరోలులో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

కొండపి ఎంపిడిఒగా నాగమణి

కొండపి : కొండిపి ఎంపిడిఒ నాగమణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నాగమణికి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఐ రాములు నాయక్‌కు సన్మానం

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం సిఐగా బాధ్యతలు చేపట్టిన రాములు నాయక్‌ను త్రిపురాంతకం దేవస్థానం ఛైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కొత్తమాసు కృష్టయ్య, వెంకట స్వామి, హనుమంతరావు, చిన్న మస్తాన్‌రావు, కృష్ణ, హరీష్ పాల్గొన్నారు

తెగులుతో శనగ రైతు విలవిల

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ ఏడాది రబీ సాగుగా చేపట్టిన శనగ రైతులకు మొదట్లో వర్షం దెబ్బ తగిలి కలుపులు బెడదతో అధిక ఖర్చు అయ్యింది. కొంతమంది రైతులు వర్షంకు పూర్తిగా దెబ్బతిన్న శనగను దున్నేశారు. మళ్లీ 2వసారి విత్తనవెద చేపట్టారు. దున్నకుండా ఉంచిన శెనగకు కలుపుకూలి ఎకరాకు రూ.15వేల వరకు సగటున ఖర్చు అయ్యింది. ఎకరాకు 30నుంచి 40మంది వరకు కలుపు కూలీలకు ఒకొక్కరికి రూ.400 నుంచి రూ.500వరకు బాడుగతో కలిపి కూలి చెల్లించారు. దీంతో ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15 వేల వరకు కలుపు కూలి ఖర్చు అయింది. దెబ్బతిన్న శనగ పొలాల్లో మళ్లీ విత్తనాలు ఎదబెట్టేందుకు ఎకరాకు రూ.10వేల వరకు వ్యవసాయంతో కలిపి ఖర్చు అయింది. ఇంత పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులకు మళ్ళీ ఎండు తెగులు, వేరు కుళ్ళు తెగులు సోకి ఎకరాలకు ఎకరాలు ఎండిపోవటంతో రైతులు పూర్తిగా దెబ్బతిననున్నారు. ఎండు తెగులు సోకిన శనగ రైతుకు గోడదెబ్బ, చెంపదెబ్బ తగిలినట్లయ్యింది. ముదురు శనగ కాయ పాకం దశకు రాగా దాదాపు మరోపక్షం రోజుల్లో కోతకు రానుంది. ముదురు శనగల్లో కూడా పూర్తిగా పెట్టుబడి పెట్టిన తరువాత మారిన వాతావరణ పరిస్థితులతో కొంత మంది రైతుల శనగ పోలలుకు ఎండు తెగులు సోకింది. వర్షం


తెగులుతో ఎండిపోతున్న శనగ పంట

పోయిన తరువాత ఎదబెట్టిన లేత శనగ పూతదశకు చేరింది. లేత శనగ రైతులను సైతం తెగులు వెంటాడుతుంది. ఎకరాకు కౌలుతోపాటు రెండు విడతల విత్తనాలు, పెట్టుబడి అన్ని కలిపి రూ.40వేల వరకు ఖర్చు అయింది. తెల్ల శనగ సాగు చేసిన రైతుకు మరో రూ.7వేలు అదనపు ఖర్చు అయ్యింది. గత ఏడాది తెల్లశ నగ రకాలు ధర బాగా ఉండటంతో రైతులు కొంతమంది తెల్ల సెనగ సాగు వైపు మొగ్గు చూపారు. అవి క్వింటా రూ.13వేల చొప్పున విత్తనాలకు కొని రైతులు విత్తనాలు ఎద పెట్టారు. ఎర్రశెనగ క్వింటా రూ.6వేల చొప్పున కొన్ని ఎదబెట్టారు. మండలంలోని ఇంకొల్లు, దుద్దుకూరు, కొణికి, నాగండ్ల, సూది వారిపాలెం గ్రామాల్లో ఎండు తెగులు ఎక్కువగా ఆగుపిస్తుంది. అలానే పర్చూరు, కారంచేడు, మార్టూరు మండలాల్లో కూడా శనగ సాగు చేసిన రైతులు ఎండు తెగులు సోకిందని చెబుతున్నారు.

ఇంకొల్లుకు చెందిన గంట అనిల్ అనే రైతు 30ఎకరాల్లో శనగ సాగు చేశారు. అందులో 15ఎకరాలు తెల్లశనగ మరో 15ఎకరాలు ఎర్రశనగ వేశారు. ఈ 30ఎకరాల్లో 25ఎకరాలు కౌలు పొలమే సాగు చేస్తున్నారు. తెల్ల శనగ 15ఎకరాల్లో ఒక ఏడు ఎకరాలు చేలో నాలుగు ఎకరాలకు తెగులు సోకి పూర్తిగా దెబ్బతిని కాపు దశలో పూర్తిగా ఎడిపోయిందని వాపోయారు.

నాగలక్ష్మి ఇంకొల్లులో 11ఎకరాలు సెనగ సాగు చేయగా అందులో ఏడెకరాలు కౌలు పొలమే. 6ఎకరాలు తెల్లశనగ, 5ఎకరాలు ఎర్రశనగ సాగు చేపట్టారు. ఎకరాకు 27మంది చొప్పున సగటున కలుపు కూలి ఖర్చు అయింది. ఎకరాకు కౌలు రూ.20వేలు శనగ సాగుకు విత్తనాలు, దుక్కి, ఎరువులు, కలుపు అన్ని కలిపి మరో రూ.25వేలు ఖర్చు అయినట్లు తెలిపింది. ఎకరాకు ఇప్పటికే రూ.45వేలు పెట్టుబడి పెట్టారు. రెండు ఎకరాల తెల్లచనగ ఎండు ముఖం పట్టిందని, మరో ఎకరంన్నర కూడా ఎండు ముఖం పట్టిందని వాపోయారు. తంతా అయిపోయినాక కోత దశకు వచ్చే తరుణంలో ఎండిపోవటంతో పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు.

'పులుగు' ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

ఎవరెన్ని చెప్పినా బాపట్ల టిడిపి టిక్కెట్ తనదేనని చెప్పుకుంటూ బాపట్లలో పులుగు మధుసూదనరెడ్డి కార్యాలయం ప్రారంభించారు. టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నాని చెప్పుకుంటూ హడాహుడి చేస్తున్నారు. దీంతో స్పందించిన టిడిపి జిల్లా నేతలు పులుగు మధుసూదనరెడ్డికి టిడిపితో ఏ విధమైన సంబంధం లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు ఏలూరు సాంబశివరావు ప్రకటించారు. అయినప్పటికీ పట్టణంలో యువకులతో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసేందుకు పోలీసుల అనుమతి తీసుకున్నానని చెబుతున్నారు. అయితే అక్కడ సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు పోలీసులు నిరాకరించారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో ప్రజారాజ్యం పార్టీ నాయకుడిగా మధుసూదనరెడ్డి బాపట్లలో ప్రచారం చేసుకున్నారు. 2019ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా బాపట్ల నుండి పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆ పార్టీ మరో అభ్యర్థిగా ఇక్కుర్తి లక్ష్మీనరసింహారావుకు జనసేన బి ఫారం ఇచ్చింది. అప్పటి


బాపట్లలో మధుసూదనరెడ్డి బైక్ ర్యాలీ

నుండి కనిపించకుండా పోయిన పులుగు మధుసూదనరెడ్డి తాజాగా పట్టణంలో హల్చల్ చేస్తూ టిడిపి అభ్యర్ధిని తానేనంటూ, పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నట్లు మధుసూదనరెడ్డి ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారు. జిల్లాలో తెలుగుదేశం నాయకులు పార్టీతో సంబంధం లేదని చెప్పినప్పటికీ ఆయన ప్రచార వేగాన్ని మరింత పెంచడంతో పార్టీలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.


నూతన ఎంపిడిఓ మల్లికార్జునరావును సత్కరిస్తున్న ఎంపిపి

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన ఎంపీడీఓగా జేబీబి మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి ఎంపీడీఓగా పనిచేసి ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన గుమ్మా చంద్రశేఖర్ కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరావును ఎంపీపీ డివి లలిత కుమారి, ఎఒ జలజ, పిఓపిఆర్డి ఊహారాణి, నాయకులు మల్లేశ్వరరావు, సిబ్బంది సత్కారం చేశారు. భట్టిప్రోలు, వెల్లటూరు, పెదపూలివర్రు, ఓలేరు, సూరేపల్లి, పంచాయతీ కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, జోజి, శ్రీదేవి, అనురాధ పాల్గొన్నారు.


ఎంపీడీఒ ఏ శ్రీనివాసమూర్తిని అభినందిస్తున్న డిఎల్‌పిఓ

ఎంపీడీవోగా శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నూతన ఎంపీడీఒగా ఎ శ్రీనివాసమూర్తి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లా కొనకనమిట్ల ఎంపీడీఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను డిఎల్‌పిఓ తాత శివ శంకరరావు, కార్యదర్శులు ఈవూరి విజయబాబు, కొండవీటి సురేష్ బాబు, కాటూరి వెంకటేశ్వరరావు అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ఆశయం

ప్రజాశక్తి -అద్దంకి

మహిళల ఆర్థిక స్వాలంబన, అభివృద్ధి లక్ష్యంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి పథకాలు సృష్టించి అమలు చేసి చూపిన ఘనత ఆయనకే దక్కుతుందని వైసిపి ఇన్చార్జ్ పాణ్యం హనిమిరెడ్డి అన్నారు. స్థానిక కాలేజీ గ్రౌండ్లో వైఎస్సార్ ఆసరా 4వ విడత లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కమిషనర్ బి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సభలో హనిమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం 34రకాల పథకాలను అమలు చేస్తుందని అన్నారు. మెప్మా పరిధిలోని మహిళలకు రూ.18.18కోట్లను తిరిగి ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రూ.4.28కోట్లు మహిళల బ్యాంకు కాతాల్లో పడతాయని ప్రతి మహిళా గుర్తుపెట్టుకుని జగనన్న లక్ష్యమైన 175కు 175సీట్లలో గెలిపించాలని కోరారు. ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. కులం, మతం, రాజకీయం


వైఎస్ఆర్ ఆసరా చెక్కునందిస్తున్న దృశ్యం

చూడకుండా అర్హత కొలబద్ధగా పదకాలు అమలు చేశారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళల హృదయాలకు చేరువైన వ్యక్తి అన్నారు. నేడు, రేపు మరి ఎప్పటికీ ప్రజలకు అండగా నిలిచే వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అని కొనియాడారు. అనంతరం డ్వాక్రా మహిళలు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి హనిమిరెడ్డిని సన్మానించారు.

ఎంపీడీవో బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి - కారంచేడు

నూతన ఎంపిడిఒగా బాబురావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా చేబ్రోలు ఎంపీడీఒగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉద్యోగులు , ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు.


ఎంపిడిఒ బాబురావు సత్కరిస్తున్న సిబ్బంది

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - బాపట్ల


ఎంపీడీవో విజయ శేఖర్

నూతన ఎంపీడీఒగా పర్రె విజయ శేఖర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా కందుకూరు నుండి విజయ శేఖర్ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్చార్జి ఎంపీడీఒగా ఈఓపిఆర్‌డి పులి శరత్ బాబు బాధ్యతలు నిర్వర్తించారు. విజయ శేఖర్‌ను కార్యాలయ పరిపాలన అధికారి జెబిఎస్ రజని, ఈఒఆర్ డి శరత్ బాబు తెలిపారు.


నియామక పత్రం అందిస్తున్న బీసీ నాయకులు

బీసీ సంఘం అధ్యక్షునిగా ప్రసాదరావు

ప్రజాశక్తి - బాపట్ల

వేమూరు నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా రాయన ప్రసాదరావును నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. గురువారం జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి కమిటీల నియమకాలు చేస్తామన్నారు. బీసీల ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దిబోయిన తాతయ్య, జొన్నాదుల వెంకటేశ్వరరావు, అంగలకుదురు నటరాజన్, మారం రవి కుమార్, ఎన్ఎస్‌పి రాజు, ఈడే శ్రీనివాసరావు, వై సాంబయ్య, రఘురామయ్య, జె కిశోర్, జె నరేష్ పాల్గొన్నారు.

మార్టూరు సర్కిల్‌కు ఇద్దరు సీఐలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


ఎస్‌వి రాజశేఖరరెడ్డి

మార్టూరు సిర్కిల్‌కు ఇద్దరు సీఐలను కేటాయిస్తూ గుంటూరు రేంజ్ ఐజి కార్యాలయం నుండి ఉత్తర్యులు గురువారం వెలువడ్డాయి. మార్టూరు సర్కుల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి అక్కేశ్వరరావు గత నెల్లో ప్రధాన మంత్రి బందోబస్తుకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. అయన స్థానంలో రేంజ్ విఆర్‌లో ఉన్న సి సీతారామయ్యను నియమించారు. అలాగే మార్టూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌గా అప్ గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఎస్ఐగా పనిచేస్తున్న ముసలం శ్రీనివాసరావును చినగంజాం స్టేషన్‌కు బదిలీ చేశారు. రేంజ్ విఆర్‌లో ఉన్న ఎస్‌వి రాజశేఖరరెడ్డిని అర్బన్ సీఐగా నియమించారు.

మాజీ ఎఎంసీ వైస్ చైర్మన్ బుడే మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


మహమ్మద్‌బుడే

మాజీ ఎఎంసీ వైస్ చైర్మన్, మాజీ జెడ్‌పి కో ఆప్షన్ సభ్యులు, మార్టూరు శ్రీ విఘ్నేశ్వర కూరగాయల మార్కెట్ వర్తకుల సంఘం మాజీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బుడే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మహమ్మద్ బుడే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కుల, మతాలకు ఆతీతంగా పలు దేవాలయాలకు, ప్రార్ధనా మందిరాలకు సహకారం అందించారు. కోవిడ్ సమయంలో కుమారుడు రషీద్‌తో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన మార్టూరు శ్రీ విగ్నేశ్వర కూరగాయల మార్కెట్ అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారు. బుడే మృతిపట్ల వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి, కూరగాయల వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కన్నెగంటి శ్రీనివాసరావు, తన్నీరు రామారావు, ఉపాధ్యక్షులు గొట్టిపాటి వెంకటరావు సంతాపం తెలిపారు.

ఎంపీడీఒగా మ్యాత్యుబాబు

ప్రజాశక్తి - పంగులూరు


ఎంపీడీఒగా మ్యాత్యుబాబు

నూతన ఎంపీడీఒగా కె మ్యాత్యుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎంపీడీఒగా పనిచేస్తున్న బి రామాంజనేయులు బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా రొంపిచర్ల ఎంపీడీఒగా పనిచేస్తున్న మ్యాత్యుబాబు పంగులూరు వచ్చారు. ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. తోటి సిబ్బంది సహకరించాలని కోరారు.

వైసిపి గుండాలతో మైనింగ్ అధికారుల దాడులు

● గ్రానైట్ యజమానుల అరెస్టులో కుట్ర కోణం ● ఫిర్యాదు దారుల అరెస్టు దారుణం ● పోలీసులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి ● టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాజకీయ కక్షసాదింపులో భాగంగానే ప్రతిపక్ష పార్టీకి చెందిన గ్రానైట్ పరిశ్రమలపై మైనింగ్ అధికారులతో దాడులు చేయిస్తూ పారిశ్రామిక వర్గాన్ని నిర్వీర్యం చేసి కార్మికుల జీవనోపాధిని పూర్తిగా దెబ్బతీయడానికి వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు ఆరోపించారు. గ్రానైట్ పరిశ్రమలపై మైనింగ్ అధికారులు వైసీపీ రౌడీలతో వచ్చి దాడులు నిర్వహించిన ఘటనలో నిందితులను పోలీసులకు అప్పగించినప్పటికీ పారిశ్రమల యజమానులపైనే అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. వైసిపి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వకంగా టిడిపి సానుభూతిపరుల ఫ్యాక్టరీలపై దాడులు నిర్వహించారని మండిపడ్డారు. మారణాయుధాలు, కారం పొట్లాలు, కర్రలతో వచ్చిన వారిని వదిలి వారిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పరిశ్రమల యజమానులు, టిడిపి నాయకులపై కేసులు నమోదు చేయడాన్ని ఆక్షేపించారు. ప్రభుత్వ



ఎమ్మెల్యే ఏలూరి

చర్యలతో గ్రానైట్ పరిశ్రమలు మూతపడే దిశగా తీసుకెళ్లిన ఘనత వైసిపి ప్రభుత్వ పెద్దలకే దక్కుతుందని అన్నారు. తక్షణమే మైనింగ్ అధికారుల కక్ష సాధింపు దాడులను నిలిపివేయాలని కోరారు. పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. ప్రశాంతంగా ఉన్న పర్చూరు నియోజకవర్గంలో భయానక వాతావరణ సృష్టించి, ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి, అలజడి రేపేందుకు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు.

బాధితులపైనే కేసులా...?

మార్టూరు గ్రానైట్ పరిశ్రమల్లో మైనింగ్ అధికారులతో వచ్చిన వైసీపీ రౌడీ మూకలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రానైట్ యజమానులపై కేసులు నమోదు చేయడంపై ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మారణాయుధాలతో వచ్చిన వారిని వదిలి గ్రానైట్ యజమానులను దొంగలుగా ముద్ర వేసి వారి ఫిర్యాదు తీసుకోకుండా, వారిపైనే కేసులు నమోదు చేయడం హేయమైన చర్యని అన్నారు. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి టిడిపి సానుభూతిపరుల పరిశ్రమలపై దాడులు చేసి అరెస్టు చేయడమే కాకుండా కేసును కోర్టులో ప్రవేశపెట్టడంలోనూ పోలీసులు తీవ్ర జాప్యం చేశారని పేర్కొన్నారు. గత నెల 30న ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రానైట్ పరిశ్రమ యజమానులు, టిడిపి నాయకులను స్టేషన్‌లో నిర్బంధించి రాత్రంతా కూర్చోబెట్టారని అన్నారు. మరుసటి రోజు 31న ఉదయం 7గంటలకు అద్దంకి కోర్టుకు తీసుకువెళ్లి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రిమాండ్ నిమిత్తం హాజరు పరచకుండా పోలీసులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారని అన్నారు. దీని వెనుక కుట్ర కోణం దాగి ఉందన్నారు.

కూల్చి 9 నెలలైనా చర్యలేవీ.?



అద్దేపల్లి లో పిఎసిఎస్ గోడౌన్ (ఫైల్)

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి సంబంధించిన అద్దేపల్లిలోని గోడౌను శిథిలావస్థకు చేరడంతో దానిని సమీప గ్రామస్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. తొమ్మిది నెలల క్రితం ఈ గోడౌన్‌ను ఎలాంటి అనుమతి లేకుండా జెసిబితో పగల కొట్టి దానిలో విలువైన సామాగ్రిని అక్రమంగా అమ్ముకున్నారు. దీనిలో ప్రధానమైన టేకు దర్వాజాలు, కలప, ఇనుప రేకులు, ఇనుప దిమ్మెలను వేలాది రూపాయలకు అమ్ముకున్నారు. కానీ ఆనాడు సంబంధిత సొసైటీ అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సొసైటీ గోడౌన్ ఆక్రమణ అనే కథనంతో ప్రజాశక్తి ప్రచురించగా స్పందించిన సొసైటీ అధికారులు ఈ భూమి సొసైటీకి సంబంధించినదని, ఆక్రమణదారులు శిక్షారులని బోర్డుని ఏర్పాటు చేసి వదిలేశారు. అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన అక్రమార్కులు వదిలిపెట్టకుండా దీనిలో ముస్లింలకు సంబంధించిన మదర్స నిర్మాణాన్ని చేపట్టేలనే దృక్పథంతో కొందరు ముస్లిములు ఏకమై మంత్రి నాగార్జునను తప్పుదోవత పట్టించే విధంగా వ్యవహరించారు. దానిలో కొంత స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణం కూడా చేపట్టారు. ఈ స్థలం సొసైటీకి సంబంధించినదని, దీనిలో ఆక్రమణదారులు ప్రవేశించి గోడౌను స్థలాన్ని ఆక్రమిస్తున్నట్లుగా కొందరు అదే వర్గానికి చెందిన వారు కోర్టును ఆశ్రయించారు. స్థలానికి సంబంధించిన ఆధారాలతో లోకాయుక్తలో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమణదారులకు సంబంధించి డాక్యుమెంట్లు ఉంటే తీసుకురావాలని నోటీసులు జారీ చేశారు.

మంత్రికీ తప్పడు సమాచారం

ఆ స్థలం మాదేనంటున్నప్పటికీ దానికి సంబంధించిన ఆధారాలు చూపించకపోవటమే కాక స్థలం తమదేనని మంత్రి నాగార్జునను నమ్మించారు. పూర్తి సమాచారం తెలుసుకున్న నాగార్జున ఈ స్థలం సొసైటీకి సంబంధించినదేనని, ఆ స్థలంలోకి వెళ్ళరాదని ఆక్రమణదారులను హెచ్చరించినట్లు తెలిసింది. సుమారు 70ఏళ్ల క్రితం రేపల్లె మార్కెటింగ్ కమిటీ పరిధిలో భట్టిప్రోలు రైతుల అవసరాల దృష్ట్యా గోడౌను నిర్మించారు. అప్పటి నుండి 50ఏళ్ల పాటు పిఎసిఎస్ ఆధీనంలో కొనసాగింది. అనంతరం శిథిలవస్తుకు చేరిన గోడౌన్లు తొలగించి నూతన గోడౌన్ నిర్మించాలని సొసైటీ అధికారులు భావించారు. ఎలాంటి ఆధారాలు లేని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించుకుంటుంటే సొసైటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కోర్టుకూ తప్పుడు నివేదికలు

ఇదిలా ఉండగా లోకాయుక్త కోర్టులో జిల్లా సహకార అధికారులు ఈ భూమి సొసైటీ ఆధీనంలోనే ఉందని, దీనిని తామే తొలగించామని, దీనిలో ఉన్న పాత సామాగ్రి కూడా తమ అధీనంలోనే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అధికారులు కోర్టులో తప్పుదొవ పట్టించే విధంగా సమాచారం ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సొసైటీ ఆధీనంలో ఉన్న పాత సామాగ్రిని ఎందుకు వేలం వేయలేదని ప్రశ్నిస్తున్నారు. సుమారు 6సెంట్లుగా ఉన్న ఈ స్థలం తమదేనని చెప్పే సహకార సంఘం అధికారులు ఇప్పటికీ దీనిని పరిరక్షించడంలో విఫలం చెందారనే ఆరోపణలు ఉన్నాయి. గోడౌన్ స్థలం వెనుక భాగంలో ఆక్రమణదారుల స్థలానికి వెళ్లే మూడు గజాల మార్గాన్ని అక్రమంగా జెసిబితో మరో రెండు గజాలకుపైగా తొలగించారు. ప్రస్తుతం రహదారిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న సొసైటీ అధికారులు ఎలాంటి ఫినిషింగ్ ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు విస్మయ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఆక్రమణకు గురవుతున్న సొసైటీ గోడౌన్ స్థలాన్ని పరిరక్షించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.



మదర్సా నిర్మాణం చేపట్టిన పిఎసిఎస్ స్థలం



ఆలయనికి విరాళం ఇస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని కొప్పరం గ్రామంలో నూతనంగా గ్రామస్తులు నిర్మాణం చేయనున్న అంకమ్మ తల్లి దేవాలయానికి వైసీపీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి రూ.5లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణం కొరకు వారం రోజుల క్రితం హనిమిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, మాజీ ఎఎంసి చైర్మన్ బొల్లినేని రామకృష్ణ, మాజీ సర్పంచి గుంజి లక్ష్మయ్య, ఓరుగంటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

7న షర్మిల రాక

ప్రజాశక్తి - బాపట్ల



మాట్లాడుతున్న అంజిబాబు

ఈనెల 7న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బాపట్ల వస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజి బాబు తెలిపారు. స్థానిక పటేల్ నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో జరిగే రోడ్ షోలో పాల్గొంటారని అన్నారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ వాదులు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపిని నమ్మే రోజులు పోయాయని అన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవానికి కృషి చేయాలని అన్నారు.



సమావేశంలో బాపట్ల ఆర్‌డిఒ గంధం రవీంధర్

ఓటుకు గుర్తింపుకార్డు తప్పనిసరి

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారివద్ద గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్ అన్నారు. గుర్తింపు కార్డులు లేకుండ ఓటు వేయటానికి వచ్చేవారిని లోనికి అనుమతించవద్దని అన్నారు. స్థానిక రోటరీ భవన్లో ఎన్నికల ప్రక్రియపై అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టే ముందు అందరి సమక్షంలో మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఎన్నిక మధ్యలో ఈవిఎంలు మొరాయిస్తే ఉన్నత అధికారుల అనుమతితో మరో ఈవిఎంని ఉపయోగించ వచ్చని తెలిపారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు అధికారులు, అభ్యర్థులు ఎవరు వచ్చిన వారి వివరాలు విజిట్ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వ్యక్తి యొక్క సంతకం 17ఎ అటెండెన్స్ రిజిష్టర్లో తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ వద్దకు వచ్చే ముందు పోలింగ్ సామగ్రిని పరిశీలించి, తగిన సిబ్బంది ఉన్నారా లేదా సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌళిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి ప్రభుత్వ అవినీతి గురించి ప్రజలకు వివరించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, టిడిపి ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అవినీతి పెచ్చుమీరిందన్నారు. వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బాబు వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి బోడాచెనం వీరయ్య, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, చెవుల అంజయ్య పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - చీరాల

నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నిర్వహిస్తూ నర్సింగ్ విద్యార్థినీలను మానసిక వేదనకు గురిచేస్తున్న చీరాల కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై విచారణకు ఆదేశించి చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయమ్మకు వినతి పత్రం అందజేసినట్లు తెలుగు యువత పట్టణ ఉపాధ్యక్షుడు ఆకురాతి రేవంత్ గురువారం తెలిపారు. నర్సింగ్ విద్యార్థినిలను కాలేజీ యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల్లో చేరిన సమయంలో ఒకలా తర్వాత మరో విధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్కాలర్షిప్పులు రావడం ఆలస్యమైతే విద్యార్థినీలను ఫీజుల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. విద్యా దీవెన, వసతి దీవెన నిధులు కాక మెస్ బిల్లు నెలకి రూ.1వెయ్యి అయితే రూ.3వేలు కట్టమంటు వత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. కనీసం స్టాప్ రిక్రూట్మెంట్ కూడా జరగలేదని తెలిపారు. తరగతులు కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉందన్నారు. విచారించి చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని పిర్యాదులో పేర్కొన్నారు.



డిఎంహెచ్ ఓకు ఫిర్యాదు చేస్తున్న రేవంత్

50 డివిజన్‌లో 'జనం కోసం జనార్ధన్'



ప్రజలతో మాట్లాడుతున్న జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని 50 డివిజన్‌లో జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. డివిజన్‌కు చేరుకున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకి డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జనార్ధన్ ఇంటింటికీ వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ఒక విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కమ్మ వెంకటేశ్వర్లు, పి వెంకటేశ్వరెడ్డి, బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, తమిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఉత్సాహంగా నారీ కోసం నాగ సత్యలతమ్మ

ఒంగోలు నగరంలోని 15వ డివిజన్‌లో నారీ కోసం నాగసత్యలతమ్మ కార్యక్రమం గురువారం రాత్రి ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సతీమణి దామచర్ల నాగ సత్యలత పాల్గొన్నారు. డివిజన్‌లోని స్థానిక మహిళలతో కలసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో 15వ డివిజన్ లోని ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా జశ్వంతరావు బాధ్యతల స్వీకరణ



మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి..
పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ జశ్వంతరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎం.జశ్వంత రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెనాలి కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీలలో ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించబడ్డారు. దీంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఒంగోలు నగర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మేయర్ గంగాడ సుజాతను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు ఉద్యోగులు నూతన కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం: కుందురు



ఆర్‌బికెని ప్రారంభిస్తున్న కుందురు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కె.నాగార్జున రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తెలిపారు. మార్కాపురం మండలం వేములకోట-2 గ్రామ సచివాలయ పరిధిలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ భవనాలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, జంకె వెంకట రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఎంపీడీవో తోట చందన, మండల విస్తరణ అధికారి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో జరగాల్సిన సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం వాయిదా పడినట్లు జిల్లా సోషల్ వెల్ఫేర్ డిడి ఎన్. లక్ష్మా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.

సమతుల్య కేంద్ర బడ్జెట్: మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ 2024 బడ్జెట్‌లో అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించడం ద్వారా సమతుల్య బడ్జెట్‌గా ఉందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. విభజనతో ఆర్థిక లోటులో వున్న ఏపీకి ప్రత్యేకంగా అన్ని విషయాల్లో తప్పక న్యాయం చేస్తారని ఆశిస్తూ ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

3న ఎంపి మాగుంట పర్యటన

మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 3వ తేదీ పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక కొత్తపట్నం రోడ్డులోని ముస్లిం బరియల్ గ్రౌండ్స్ లో నిర్మించిన సిమెంట్ రోడ్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఒంగోలు మండలం కరవది గ్రామంలో సహకార సంఘ ప్రెసిడెంట్ వాకా కష్ణారెడ్డి తల్లి పెద్ద కర్మ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

సంక్షేమ పథకాల అమలుకే తొలి ప్రాధాన్యత

- లక్ష్యాల సాధనకు చర్యలు - బాధ్యతలు స్వీకరించిన జేసీ రోణంకి గోపాలకృష్ణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి -ఒంగోలు

జిల్లాలో ప్రభుత్వం అమలుచేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు తొలి ప్రాధాన్యత ఇచ్చి లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకుంటామని జిల్లా సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. తొలుత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను జెసి గోపాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంయుక్త కలెక్టర్‌గా గురువారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు, అధికారులు, ప్రజలందరి సహకారంతో ప్రభుత్వం కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

పలువురు అధికారుల అభినందనలు

సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రోణంకి గోపాలకృష్ణను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. జేసీని కలిసిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, ఒంగోలు ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీ రాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ,ఉదయ భాస్కర్, ఆర్‌ఐఒ ఏ.సైమన్ విక్టర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి చిరంజీవి, ఒంగోలు తహశీల్దార్ పసుపులేటి మురళి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్జీవో అసోసియేషన్ ఉన్నారు.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ

జెండా ఊపి ప్రారంభించిన డిటిసి ఆర్.సుశీల



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డిటిసి సుశీల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఒంగోలు నిర్వహించిన ద్విచక్ర వాహన, మోటార్ కార్ల ర్యాలీ ఉత్సాంగా సాగింది. స్థానిక మినీ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల జెండా ఊపి ప్రారంభించారు. రహదారి భద్రతా మాసోత్సవాలు ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ర్యాలీ మినీ స్టేడియం నుండి ప్రారంభమై కలెక్టర్ కార్యాలయం మీదుగా ట్రంక్ రోడ్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్ జంక్షన్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ పరిపాలన అధికారి ఎం శ్రీనివాసుల రావు, మోటార్ వాహన తనిఖీ అధికారులు, కె రామచంద్ర రావు, ఎల్. సురేంద్ర ప్రసాద్, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు కె. జయ ప్రకాష్, కె రవి నాయక్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అస్లాం, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత..

బాపట్ల: రహదారి భద్రత మన అందరి భాద్యత అనే లక్ష్యం తో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్ సురేష్ వాహన దారులకు సూచించారు. గురువారం 35వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ నూతన అధికారిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆర్ సురేష్ ఆధ్వర్యంలో బాపట్ల ఎన్జీవో హెూం లో విద్యాసంస్థల వాహన, ఆటో డ్రైవర్లకు బైక్ చోదకులకు రహదారి భద్రతా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సురేష్ వివరించారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే టప్పుడు సెల్ ఫోన్ వినియోగించరాదన్నారు. ప్రధానంగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదన్నారు. కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారి డివిబి రంగారావు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించండి

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు
- 2వ రోజుకి రిలే నిరాహార దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 2వ రోజుకి చేరుకున్నాయి. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. దీక్షలను ప్రారంభించిన జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డిఎస్సి నిర్వహిస్తామని చెప్పి నేడు తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్స్, కార్మికులకు ఒకటో తేదీ జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. అనంతరం జిల్లా సహాధ్యక్షులు, సిపిఎస్ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ పాత పెన్షన్ ఇస్తానని మేనిఫెస్టోలో ప్రకటిస్తుందో ఆ పార్టీకి యుటిఎఫ్ సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తుందన్నారు. రిలే నిరాహార దీక్షలు ముగింపు సందర్భంగా దీక్షలలో కూర్చొన్న ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. దీక్షలలో జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు, డి వెంకట్ రెడ్డి, టి రాజశేఖర్, యమ్ బాలరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోటేశ్వరరావు , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు,పెన్షనర్స్ సంఘ గౌరవాధ్యక్షులు టివిఆర్ సుబ్బారావు జిల్లా కార్యదర్శి సూదనగుంట నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.శ్రీనివాసులు, యుటిఎఫ్ ఒంగోలు టౌన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ, రసూల్ పాల్గొన్నారు.